## మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేదు



**అక్షరటుడే, నాంపల్లి :** మహిళలపై దాడి జరిగితే ప్రభుత్వానికి కనీసం పట్టింపు లేదని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం వారు మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. పోలీసుల తీరుతో తాము కన్నీరు పెట్టుకున్నా కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళా ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పోలీసుల దాడిలో తమకు గాయాలు అయ్యాయన్నారు. అయినా సభలో తామకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు.

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

## పంజాబ్ ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ విమర్శలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శలు చేశారు. డ్రగ్స్ బెడదను ఎదుర్కోవడానికి రాష్ట్రం తగినంతగా కృషి చేయడం లేదని ఫిర్యాదు చేసిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వ ఒత్తిడి, బెదిరింపులతో అతడు ప్రాణాలు తీసుకున్నాడని రాహుల్ ఆరోపించారు. పంజాబ్ ప్రభుత్వంలో ఒక ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని విమర్శించారు.

9-9-2026 (Wednesday) | MAIN EDITION

### ఒకేరోజు ఆరు ఐపీవోలు ఓపెన్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో లిస్టవడానికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. సెప్టెంబర్ 9న ఆరు మెయిన్‌బోర్డ్ కంపెనీల పబ్లిక్ ఇష్యూ ప్రారంభమైంది. ఈ క్రమంలో 30 ఏళ్ల రికార్డు బద్దలయ్యింది. ఇలా ఒకే రోజు మెయిన్‌బోర్డ్‌నుంచి ఆరు ఐపీవోలు రావడం 1996 అక్టోబర్ 14 తర్వాత ఇదే తొలిసారి.

### ఎస్సీలపై బీఆర్ఎస్ వివక్ష



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** అసెంబ్లీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీలపై బీఆర్ఎస్ విపక్ష చూపుతోందన్నారు. ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతంలో పసుపు నీళ్లతో శుద్ధి చేశారని ఆరోపించారు. ఈ సంఘటనపై కేటీఆర్, హరీష్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### చావు కోరుకునే సంస్కృతి మా పార్టీది కాదు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో వందేళ్లకు పైగా బతికుండాలని తాము కోరుకుంటున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఎవరి మరణాన్నీ కోరుకునే సంస్కృతి కాంగ్రెస్ పార్టీది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ అనుభవంతో కూడిన మార్గదర్శకత్వం అవసరమని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల గొంతు నొక్కడమే : హరీశ్ రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం ముమ్మాటికీ ప్రజా సమస్యల గొంతు నొక్కడమేనని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఇది కేవలం బీఆర్ఎస్ పార్టీ సస్పెన్షన్ కాదని, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ అని ఆయన విమర్శించారు. తమ సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలని ప్రజలు కోరుకుంటుంటే.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల గొంతుకైన బీఆర్ఎస్ సభ్యులను బయటకు పంపడమే పనిగా పెట్టుకున్నారని నిప్పులు చెరిగారు.



**శాసన సభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ సస్పెండ్ చేశారు. మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. తమను పోలీసులు అడ్డుకోవడం, కేసులు నమోదు చేయడంపై బీఆర్ఎస్ సభ్యులు చర్చకు డిమాండ్ చేశారు. వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. స్పీకర్ ఎంత చెప్పినా వారు వినలేదు. దీంతో సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

■ అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు వేటు ■ పోడియం వద్ద నిరసనతో స్పీకర్ నిర్ణయం ■ గవర్నర్ కలిసిన బీఆర్ఎస్ నేతలు

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూడో రోజు సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఎర్రవల్లిలో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నాయకులు శుద్ధి చేయడంపై చర్చించారు. తమపై పోలీసులు దాడి చేయడంపై చర్చించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని పోడియం ఎదుట ఆందోళన చేశారు. దీంతో స్పీకర్ ఈ సెషన్ మొత్తం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సభలో ఆందోళన నేపథ్యంలో గులాబీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్ బాబు తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఏకపక్షంగా ఆమోదించింది.

**గవర్నర్‌కు ఫిర్యాదు చేశాం : కేటీఆర్**

అసెంబ్లీ ఎదుట తమపై దాడి చేసిన విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గవర్నర్‌కు వివరించారు. బుధవారం మధ్యాహ్నం గవర్నర్‌ను కలిశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. నల్ల టీ షర్టులు వేసుకొని నిరసన తెలిపినందుకు ఎమ్మెల్యేలమని కూడా చూడకుండా పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు చెప్పామన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించడం మేము చేసిన తప్పా అని ప్రశ్నించారు. హామీలపై చర్చించడానికి అసెంబ్లీకి వెళ్తే పోలీసులు గేట్ దగ్గర ఆపేసి తమ మీద దాడి చేశారన్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. దీని మీద అన్నీ ఆధారాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఆయన చీఫ్ సెక్రటరీని, డీజీపీని పిలిచి విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



**సభలో లేనివారిని సైతం..**

అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో లేనివారిని సైతం సస్పెండ్ చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి గురించి చర్చించకుండా డైవర్షన్ చేస్తున్నారన్నారు. తిరుపతిలో ఉన్న మల్లారెడ్డిని సస్పెండ్ చేశారని మండిపడ్డారు. సభలో లేని కేటీఆర్, గూడెం మహిపాల్ రెడ్డిని సస్పెండ్ చేశారని పేర్కొన్నారు.

## ఢిల్లీ మాజీ చీఫ్ సెక్రెటరీ ఆత్మహత్య



**అక్షరటుడే, ఢిల్లీ :** ఢిల్లీ మాజీ చీఫ్ సెక్రెటరీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాకేష్ మెహతా (74) బలవన్మరణానికి పాల్పడ్డారు. నోయిడాలోని సెక్టార్ 82లో ఉన్న కేంద్రీయ విహార్2 సొసైటీలోని స్వగృహంలో ఆయన ఫ్యాన్‌కు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. సెప్టెంబరు 6న జరిగిన ఈ విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడి కారణంగానే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.




## కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాదు: బండి సంజయ్

**అక్షరటుడే, ఖమ్మం:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే ఆ పార్టీ ఒక్క అసెంబ్లీ స్థానాన్ని కూడా గెలుచుకునే పరిస్థితి లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. భద్రాచలంలో జరిగిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు పవర్ ఫుల్ మంత్రులు ఉన్నప్పటికీ, జిల్లా అభివృద్ధి కోసం వారు సాధించింది గుండు సున్నా అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

## ‘కేసీఆర్‌కు చెడు జరగాలని కోరుకునేది సొంత కుటుంబమే’

**అక్షరటుడే, నాంపల్లి:** సీఎం రేవంత్ రెడ్డి పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కేసీఆర్ చెడును కోరుకోలేదని, ప్రతిపక్ష నేతగా ఆయనకు అన్ని వేళలా తగిన గౌరవం ఇస్తున్నామని స్పష్టం చేశారు. నిజానికి కేసీఆర్ ఆరోగ్యం క్షీణించాలని, ఆయనకు చెడు జరగాలని సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.





## వందేమాతరం గీతం ఆలపించడంపై కాంగ్రెస్ అభ్యంతరం


**అక్షరటుడే, ఢిల్లీ :** శ్రీనగర్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సమక్షంలో జరిగిన ఒక కార్యక్రమంలో పూర్తి వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అయితే దీనిపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేయడం గమనార్హం. జమ్మూ కశ్మీర్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో సోమవారం వందేమాతరంపూర్తి వెర్షన్‌ను ప్రదర్శించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. ఆ వీడియోను ట్యాగ్ చేస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, గీతం సంక్షిప్త వెర్షన్‌కే కట్టుబడి ఉండటంలో తమ పార్టీకి అండగా నిలవాలని మిత్రపక్షమైన నేషనల్ కాన్ఫరెన్స్‌కు సలహా ఇచ్చారు. దీనిపై నేషనల్ కాన్ఫరెన్స్ ధీటుగా స్పందించింది. కూటమిలోని పార్టీలకు కాంగ్రెస్ షరతులు విధించలేదని స్పష్టం చేసింది.

## మా ఫొటోలను మార్ఫింగ్ చేసి వాడుతున్నారు : కేటీఆర్

**అక్షరటుడే, హైదరాబాద్ :** తమ ఫొటోలను మార్ఫింగ్ చేసి వాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడారు. అసెంబ్లీ ఎదుట జరిగిన గొడవలో డీప్ ఫేక్ వీడియోలు సర్క్యులేట్ చేస్తున్నారని ఆరోపించారు. తాము దాడి చేసినట్లు ఫొటోలు సృష్టించారని, దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.




## అమెరికా జలాంతర్గామిని స్వాధీనం చేసుకున్న ఇరాన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** హర్ముజ్ జలసంధి ప్రవేశద్వారం వద్ద అమెరికాకు చెందిన సబ్‌మెరైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇరాన్ తెలిపింది. డైవ్ఎల్‌డిగా గుర్తించబడిన ఈ మానవ రహిత జలాంతర్గామిని నిఘా ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్నట్లు నౌకాదళం పేర్కొంది. జలాంతర్గామి ప్రపంచంలోనే అత్యంత ఆధునిక జలాంతర్గామి వాహన సాంకేతికతతో కూడి ఉందని ఇరాన్ పేర్కొంది. దానిని స్వాధీనం చేసుకున్న వీడియోను కూడా విడుదల చేసింది. అంతేగాకుండా హర్ముజ్ జలసంధిపై తమ వాయు రక్షణ వ్యవస్థలు ఒక MQ9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేశాయని ఐఆర్‌జీసీ ప్రకటించింది.

## నా డబ్బులు ఎప్పుడిస్తారు : విజయ్ మాల్యా



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా సంచలన ట్వీట్ చేశారు. తనకే బ్యాంకులు డబ్బులు బాకీ ఉన్నాయని, అవి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఈడీ ఛార్జిషీట్ ప్రకారం 2017 జనవరి నాటికి తన అప్పులు రూ.6,203కోట్లు అని మాల్యా తెలిపారు. 2021 జనవరి నాటికి అవి వడ్డీతో కలిపి రూ.10,230 కోట్లకు చేరాయని పేర్కొన్నారు. అయితే బ్యాంకులు 2021 నాటికి తనకు చెందిన రూ.14,131.60 కోట్లు రికవరీ చేసినట్లు చెప్పారు. వడ్డీతో సహా తనకు బ్యాంకుల నుంచి రూ.6,722 కోట్లు రావాల్సి ఉందన్నారు.